క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీ



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కరప: ఐసీడీఎస్ కాకినాడ రూరల్ సీడీపీఓ వై.లక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో, ప్రస్తుత సమాజంలో ఆడ పిల్లల పరిస్థితి, వారి పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, అందుకు కారణాలు, వాటివల్ల జరిగే అనర్థాలు, నియంత్రణ మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్యవివాహాలు–అనర్థాలు అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ కరప సెక్టార్ సూపర్‌వైజర్ కె.అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



బస్సు పాసులు అందుకున్న విద్యార్థినులు

బాలాజీ చెరువు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఆర్టీసీ ఇన్‌స్పెక్టర్ బీవీఎస్‌ఎస్ రెడ్డి అన్నారు. సాలిపేట బాలికోన్నత పాఠశాలకు చెందిన 420 మంది విద్యార్థులకు సోమవారం ట్రస్ట్ ద్వారా ఏడాది కాల పరిమితితో బస్సు పాసులు అందజేశారు. ట్రస్ట్ ద్వారా ఏటా ఇలాంటి కార్యక్రమాలతో పేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి జగన్నాథం, కోశాధికారి కల్యాణి, సభ్యులు నాగవేణి, రమణమూర్తి, హెచ్‌ఎం సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

తల్లి పాలతో వ్యాధుల నియంత్రణ



గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్: శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలను తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి అన్నారు. స్థానిక ఏటిమొగ దుర్గాదేవి ఆలయంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం జరిగింది. శిశువుకు తల్లిపాలతో ఎన్నో రకాల వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.
కాకినాడ సిటీ: కాకినాడ సాంబమూర్తినగర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇద్దరు గర్భిణులకు సీమంతం చేశారు.

7న ఖేలో ఇండియా రైజింగ్ స్టార్స్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఖేలో ఇండియా రైజింగ్ స్టార్స్ క్రీడాకారుల ఎంపికను ఈ నెల 7న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎంపికైన వారికి యానాంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రెనింగ్ సెంటర్‌కు పంపుతారని చెప్పారు. 7న ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎంపికల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్‌లో బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు కాకినాడ డీఎస్‌ఏలో జరిగే ఎంపికలకు సంబంధిత అర్హత పత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 89196 42248 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

55.95 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు రోడ్డులోని ఓ ఇంటిలో నిల్వ ఉంచిన 55.95 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన కనకాల దుర్గారావు తూరంగిలో నివసిస్తూ, కొవ్వూరు రోడ్డులోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఎండీయూ వాహనాలు, బియ్యం లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇతర మిల్లులకు అమ్ముతుంటాడు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కొవ్వూరు రోడ్డులోని ఇంటిలో నిల్వ చేసినట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ క్రమంలో అక్కడ దాడి చేసి, బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. మండల పౌర సరఫరాల అధికారి వి మమత బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కనకాల దుర్గారావుపై 6ఏతో పాటు, క్రిమినల్ కేసును నమోదు చేశారు. ఈ బియ్యాన్ని సమీపంలో ఉన్న రేషన్ షాపునకు తరలించారు.

గుంతలిలా.. వెళ్లేదెలా..!?

- అధ్వానంగా కాకినాడ దుమ్ములపేట–పోర్టు రోడ్డు
- పోర్టు సిబ్బంది, మత్స్యకారుల రాకపోకలకు కీలక మార్గమిదే..
- నిత్యం భారీ వాహనాల ప్రయాణం
- కనీస మరమ్మతులు చేపట్టని పాలకులు



కాకినాడ దుమ్ములపేట నుంచి పోర్టు రోడ్డులో రుచి ఆయిల్ పరిశ్రమ వద్ద దుస్థితి

కాకినాడ రూరల్: అభివృద్ధి లేదు.. రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ ఊక దంపుడు ప్రసంగాలు, సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారాలు సాగించిన కూటమి పార్టీల నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా.. వారికి రోడ్ల గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణం కంటే ముందుగా గుంతలు పూడ్చివేస్తామని ప్రకటించిన కూటమి నేతలు.. ఇప్పుడేమో చేతల్లో కాదు.. మాటలకే పరిమితమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కనీసం ప్రజల ఇబ్బందులనూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు అధికారం కోసం.. అరచేతిలో వైకుంఠం చూపించిన కూటమి నేతలు.. ఇప్పుడు డబ్బుల్లేవు.. గల్లాపెట్టె ఖాళీ అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు.

భారీ వర్షాలకు..

కాకినాడ జిల్లాకే తలమానికంగా నిలిచే పోర్టుకు వెళ్లే మార్గాలను కూడా పాలక ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. కాకినాడలో డెయిరీ ఫారమ్ సెంటరు మీదుగా దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం రేవు, పోర్టు, సీ పోర్టులకు వెళ్లే కీలకమైన మార్గం గుంతలమయంగా మారింది. వర్షాలకు భారీ గుంతలు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దుమ్ములపేట, పర్లోపేట మత్స్యకారులతో పాటు, వివిధ కార్యకలాపాల కోసం పోర్టుకు వెళ్లే వారు, మెరైన్ పోలీసులు, పోర్టు అధికారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. దమ్ములపేట, కుంభాభిషేకం మధ్య ఈ మార్గంలో రుచి ఆయిల్ ఫ్యాక్టరీతో పాటు, పలు గోడౌన్లు ఉన్నాయి. గోడౌన్లలో బియ్యం నిల్వ చేసేందుకు పోర్టుకు తరలించడం, పోర్టు నుంచి దిగుమతి చేసుకున్న ఇతర సరకులు గోడౌన్లకు చేరవేయడం కోసం భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.

జనాలకు నిత్య నరకం

రోడ్డు మార్గాన్ని ఆనుకుని ఉన్న కాల్వలో మత్స్యకారులు తమ బోట్లు, తెప్పలను వేట అనంతరం లంగరు వేసి ప్రతి రోజూ రోడ్డుపై రాకపోకలు సాగిస్తారు. భారీ వాహనాల ప్రయాణం వల్ల గుంతల్లో బురద, రాళ్లు అటుగా వెళ్తున్న జనాలపై పడుతుండడంతో వారు గాయాల పాలవుతున్నారు. దీనికి తోడు చాలా మంది ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం రాకపోకలకు వీలు కాని విధంగా ఉన్న ఈ మార్గంలో గుంతలను తక్షణం పూడ్చి వేసి, వర్షాలు తగ్గిన తరువాత రోడ్డు నిర్మించాలని మత్స్యకారులు సహా, పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నారు



దుమ్ములపేట నుంచి పోర్టు రోడ్డుకు వెళ్లే మార్గం గుంతలతో నిండిపోయింది. చాలా మంది ఈ మార్గంలో ప్రయాణాలు చేస్తున్నారు. గుంతల్లో చాలా మంది పడిపోతున్నారు. పలువురు గాయపడుతున్నారు. వెంటనే గుంతలు పూడ్చాలి.
– వాడమరిది బంగారి, మత్స్యకారుడు, పర్లోపేట, కాకినాడ



ఈ గుంతలను తప్పించుకుని వెళ్లడం నరకమే..

విధులకు గైర్హాజరైతే చర్యలు

– కమిషనర్ భావన



వెహికల్ యార్డులో సిబ్బందిని ప్రశ్నిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: సకాలంలో రాకుండా, విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం ఐదున్నర గంటలకు ఆమె నగరంలోని ఐదో సర్కిల్ పరిధిలోని మస్టర్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఏటిమొగ వెహికల్ యార్డ్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఐదో సర్కిల్ పరిధిలో సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారో, లేదో ఆరా తీశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఎంత మంది వస్తున్నారు, విధులకు సకాలంలో హాజరుకాకపోయినా, గైర్హాజరైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఏటిమొగ వెహికల్ యార్డ్‌ను పరిశీలించారు. ఆమె వెంట, ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

- కార్పొరేషన్ కమిషనర్ భావన



మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యను సత్వరమే పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను కమిషనర్ నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 15 మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడున్న అధికారులను కమిషనర్ ఆదేశించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నగపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛన్ల మంజూరు, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి వివిధ అంశాలపై ఫిర్యాదులందాయి. ప్రజలు ఇచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ వెంకటరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, పలువురు డీఈలు, ఏఈలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం



వాక్య సందేశమిస్తున్న జోసఫ్ ఎడ్వర్డ్

నాగమల్లితోట జంక్షన్: తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రథమ వార్షికోత్సవాన్ని స్థానిక గాంధీనగర్ ఎలిఫ్స్‌పేటలోని ఉన్న చర్చి ఆవరణలో సంఘ అధ్యక్షుడు రెవరెండ్ పీడీ అరుణ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాస్టర్ జోసఫ్ ఎడ్వర్డ్ వాక్య సందేశమిచ్చారు. సంఘ కార్యదర్శి డాక్టర్ పీజేవీకే గాంధీ మాట్లాడుతూ సంఘం స్థాపించి 42 ఏళ్లు పూర్తయ్యాయని, పాత చర్చి బిల్డింగ్ స్థానే గతేడాది నూతన చర్చి నిర్మాణం చేపట్టామన్నారు. సంఘ తొలి పాస్టర్ రెవ పెన్మెత్స ఎబినెజర్ సేవలను స్మరించుకున్నారు పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ రాజు, ఎన్కే జాన్, ప్రతాప్, రెవరెండ్ ఆకుమర్తి శామ్యూల్, సలాది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను రాబడితో పార్కుల అభివృద్ధి

బోట్‌క్లబ్: మున్సిపల్ కమిషనర్ గత నెల పర్యటించిన బోట్ క్లబ్ పార్కులో సమస్యలను గాలికి వదిలివేయడం దురదృష్టకరమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఆస్తి పన్నులతో వస్తున్న ఆదాయాన్ని పార్కుల ప్రగతికి వినియోగించాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక ఒకటో డివిజన్‌లోని బోట్ క్లబ్ ఉద్యానవనాన్ని రోజు వారీ పర్యవేక్షణ లేకుండా నగరపాలక సంస్థ అధ్వానంగా వదిలివేయడం వలన సమస్యలు తీవ్రమయ్యాయన్నారు. వాకింగ్ ట్రాక్ పనికి రాకుండా, 70 శాతం అధ్వానంగా మారడం, వర్షపు నీటితో బురదగా మారడం శోచనీయమన్నారు. డయేరియా ప్రబలుతున్న తరుణంలో పార్కుల్లో చెత్తాచెదారాన్ని రోజుల తరబడి తరలించకపోవడం కార్పొరేషన్ నిర్లక్ష్యానికి పరాకాష్టగా ఉందన్నా రు. పార్కుల్లో అంధకారంతో మద్యం, గంజాయి సేవించే వారికి అడ్డాగా మారడం దురదృష్టకరమన్నారు. పార్కుల్లో నిరుపయోగంగా మారిన జిమ్ పరికరాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

కొత్తపల్లి: మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు, మహిళల, బాలల చట్టాలపై సెక్టార్ సూపర్ వైజర్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. బాల్య వివాహాలు అరికట్టడంపై ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ కమ్యూనిటీ సోషల్ వర్కర్ అనిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కరప: పెనుగుదురు వంతెన వద్ద ఇరిగేషన్ భూమిని అధికార కూటమి నాయకుడొకరు ఆక్రమించినట్టు ఆ గ్రామస్తులు, రైతులు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేఎంజే కెనాల్ పరిధిలో వేల ఎకరాల పొలాలున్నాయి. ఈ పంట కాలువకు, ఓ మాజీ సర్పంచ్ భూమికి మధ్య సుమారు వెయ్యి గజాల ఇరిగేషన్ భూమి ఉంది. గతంలో ఈ భూమిని కొందరు కబ్జా చేయగా, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కరప రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించారు. అప్పట్నుంచి ఖాళీగా ఉన్న విలువైన ఈ ఇరిగేషన్ స్థలాన్ని అధికార కూటమికి చెందిన కొందరు నాయకులు ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రూ కోట్ల విలువైన ఇరిగేషన్ భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో గ్రామస్తులు, రైతులు పేర్కొన్నారు. అలాగే పెనుగుదురులో నంబర్–1 తూరను, కాలువను మూసివేసి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన లేఅవుట్‌లో కలిపేసుకున్నాడు. దానివల్ల సాగునీరందక రైతులకు ఇబ్బందికరంగా మారింది. పెనుగుదురు గ్రామంలోకి వెళ్లే రహదారిలో సుమారుగా 20 సెంట్ల పంచాయతీ భూమిని కూడా లేఅవుట్‌లో కలిపేసుకుని, విక్రయాలు చేసేశారు. ఆయా ఆక్రమణలపై పంచాయతీ, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, వీటిపై విచారణ జరిపి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌రు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన తుమ్మలపల్లి వీరబాబు, గ్రామస్తులు, రైతుల నుంచి సంతకాలు సేకరించి పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

మాదిగల వెనుకబాటు వల్లే సుప్రీం తీర్పు



ఎస్సీ రిజర్వేషన్లపై సంఘీభావం ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎస్‌ఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జంగి సుధాకర్

కాకినాడ సిటీ: మాదిగ రిజర్వేషన్ల కోసం పోరాడి సాధించిన ఘనత మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపకుడు బుంగా సంజయ్ మాదిగకు దక్కుతుందని ఎమ్మార్పీఎస్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జంగి సుధాకర్ అన్నారు. సోమవారం కాకినాడలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా మాదిగల వెనుకబాటును సుప్రీం కోర్టు గ్రహించి, మాదిగ రిజర్వేషన్ ఏర్పాటును ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడం శుభపరిణామన్నారు. ఇప్పటి వరకు అన్నదమ్ముల్లా ఉన్న మాల సోదరులకు ఈ రిజర్వేషన్ ప్రక్రియ అడ్డుకట్ట కాదన్నారు. సమాజంలో దళితులకు సంబంధించి ఉమ్మడి పోరాటానికి మాల, మాదిగలు కలిసే ఉద్యమం సాగిస్తామన్న విషయాన్ని మరువరాదన్నారు. కేవలం కొంత మంది రాజకీయ, స్వలాభం కోసం మాల, మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాల్సిన బాధ్యత అందిరిపైనా ఉందన్నారు. నాయకులు యార్లగడ్డ వరప్రసాద్, తాతపూడి మూర్తి, సవరపు నాగరాజు, పలివెల విజయకుమార్, మద్దాల రామారావు, దల్లై శ్రీకాంత్, బండి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురప్పాడులో స్వీట్లు పంచుతున్న ఇమ్మానుయేలు

గ్రామాల్లో స్వీట్ల పంపిణీ

కరప: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గం వారు సంబరాలు చేసుకున్నారు. జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చాట్ర ఇమ్మానుయేలు స్థానిక నాయకులతో కలిసి కరప, పెద్దాపురప్పాడు, వలసపాకల, గొడ్డటిపాలెం, పెనుగుదురు, నడకుదురు తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి, స్వీట్లు పంచారు. సీఎం చంద్రబాబు హయాంలో వర్గీకరణ అమలు చేసి, మాదిగలకు న్యాయం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మండల ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి సవరపు సత్తిబాబు, ఎమ్మార్పీఎస్ కో–కన్వీనర్ పలివెల రమేష్‌బాబు, రాయి చిన్న, ఉందుర్తి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



స్కూల్ రిప్రజెంటేటివ్‌లుగా ఎన్నికైన విద్యార్థులు

బాలాజీచెరువు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ దుష్యంత్ కుల్‌శ్రేష్ఠ అన్నారు. లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో సోమవారం స్కూల్ రిప్రజెంటేటివ్‌ల ప్రమాణ స్వీకరణ జరిగింది. ఈ సందర్భంగా దుష్యంత్ కుల్‌శ్రేష్ఠ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. క్రమ శిక్షణ, నాయకత్వం అందరినీ ఆదర్శంగా నిలుపుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు పలు నిర్దేశాలు చేసి, ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి.సుగుణరెడ్డి, ప్రిన్సిపాల్ వందన బోహ్రా, వైస్ ప్రిన్సిపాల్ హేమలత పాల్గొన్నారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఆర్పీ సింహాద్రి

కరప: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 23 గ్రామాల్లో చేసిన పనులపై సామాజిక తనిఖీ పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, అవకతవకలు జరిగితే నివేదిక ఇవ్వాలన్నారు. ఎస్‌ఆర్పీ పి.సింహాద్రి మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేసిన పనులపై సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. మండలంలో రూ 10.38 కోట్లతో 1,320 పనులు చేసినట్టు చెప్పారు. నలుగురు డీఆర్పీల పర్యవేక్షణలో ఆడిట్ బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి, ఆయా పనులు నిబంధనల మేరకు, నాణ్యత ప్రమాణాలతో జరిగాయా, లేదా, నిధులు పక్కదారి పట్టాయా, ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లింపులు జరిగాయా తదితర అంశాలపై తనిఖీ చేస్తారని వివరించారు. ఒక్కొక్క గ్రామంలో పనులు తనిఖీ చేసి, గ్రామ సభ నిర్వహిస్తారన్నారు. ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, డీఆర్పీలు తుది నివేదిక రూపొందిస్తారన్నారు. డ్వామా పీడీ నిర్దేశించిన తేదీల్లో ప్రజావేదిక నిర్వహిస్తారని తెలిపారు. ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, ఏపీఓ జీవీ రమణకుమార్, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు ఎస్.రాంబాబు, వీవీఎస్ వర్ధన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గురుస్మరణతో అన్నీ పొందవచ్చు



మధ్వసభలో మాట్లాడుతున్న విజయసింహాచార్

బోట్‌క్లబ్: పవిత్ర గురుస్మరణతో అన్నీ పొందవచ్చని రాజమహేంద్రవరం ఉత్తరాది మఠాధికారి, హిందూపూర్ విజయసింహాచార్ అన్నారు. సత్యాధీశ తీర్థుల ఆరాధన స్థానిక రామారావుపేట మధ్వసభలో సోమవారం నిర్వహించారు. సత్యాధీశ తీర్థుల మహిమలను వివరిస్తూ, గురుభక్తికి జీవితమే అంకితం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. వేదాలకు వ్యాఖ్యానం చేసిన మహానుభావులని, అందుకే వీరిని వేద వ్యాఖ్యాన కర్తగా కీర్తిస్తారన్నారు. మూడు సార్లు సమగ్ర భూ ప్రదక్షిణ చేసి, విజయవంతంగా వచ్చి ద్రవ్యాలను గురువులైన సత్యాభినవ తీర్థులకు సంపూర్ణంగా సమర్పించిన వ్యక్తి అన్నారు. ఆయన జీవితంలో అనేక అద్భుతాలు, మహిమలు వీక్షించవచ్చన్నారు. మూల రామదేవుని పూజను సైతం ఎంతో భక్తితో చేసిన గురువు అనుగ్రహాన్ని పొందారన్నారు. విజయ దశమి నుంచి రాజమహేంద్రవరం మఠ పునర్నిర్మాణ పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాతగిరి మధ్వేష్, రాచూరి శేషగిరిరావు, కందాళం నరసింహారావు, ఉదయగిరి శేషగిరిరావు పాల్గొన్నారు.

కన్నీటి గాథ..!

- నిండా ముంచేస్తోంది
- నీట మునుగుతున్న వీధులు
- వర్షం వచ్చినా, నీరు విడుదల చేసినా తప్పని ఇబ్బందులు
- ఏలేరు కాలువ ముంపుతో పిఠాపురం పట్టణ ప్రజల కష్టాలు



సీతయ్యగారితోట ఏరియాలో వరద నీటిలో విద్యార్థుల ఇక్కట్లు

పిఠాపురం: పంటలు పండించాల్సిన నీరు పట్టణాన్ని ముంచేస్తోంది. అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఏలేరు కాలువ పొంగిపొర్లుతూ పిఠాపురం పట్టణానికి ప్రాణ సంకటంగా మారింది. పిఠాపురం నడిబొడ్డున ఉన్న ఏలేరు కాలువ ముంపు బారిన పడి పట్టణ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఏళ్ల తరబడి కాలువ అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఏటా వరద నీటి ప్రవాహంలో పట్టణ ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పొంగిపొర్లిన నీరు బయటకు పోయే మార్గాలు లేకపోవడం, డ్రైన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏలేరులో నీరు వదిలితే..

ఏలేరు ప్రాజెక్టులో నీరు వదిలితే చాలు పిఠాపురం పట్టణం ముంపు బారిన పడుతోంది. కేవలం 400 క్యూసెక్కుల నీరు వదిలినా వీధులను ముంచెత్తుతోంది. పట్టణంలోని ఈవన్ నగర్, విద్యుత్ నగర్, ఆదిత్య స్కూలు ఏరియా, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, మంగయ్యమ్మరావుపేట, బొజ్జావారితోట తదితర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.

కాలువ మూసుకుపోయి..

పట్టణంలో పేరుకుపోతున్న చెత్తా చెదారంతో ఏలేరు కాలువ మూసుకుపోయి.. నీరు విడుదల చేసినప్పుడల్లా పట్టణంలోకి పొంగి పొర్లుతోంది. వీధులన్నీ జలమయం అవుతుండడంతో ఆయా ప్రాంతాల ప్రజల ఇళ్ల చుట్టూ మురుగు పేరుకుపోతోంది. దీంతో కాలు కూడా బయటపెట్టలేని దుస్థితి నెలకొంటోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. చెరుకుల కాలువగా పిలవబడే ఏలేరు కాలువ పలుచోట్ల మూసుకుపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. కాలువలో చెత్తను తొలగించి కాలువను అభివృద్ధి చేయనంత కాలం ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

IN THE COURT OF THE HON'BLE 1st ADDITIONAL SENIOR CIVIL JUDGE:: KAKINADA
I.P.13/2024
Between:
Bonam Venkata Nageswara Rao ...Petitioner
And
1. M/s. Gayatri Construction Firm Reptd. By its Managing Director: Adabala Suresh Kumar, S/o. Subba Rao, Aged 44 years, Door No:1-311/3, Rayudupalem, Kakinada Rural Mandal
2. Vobilineni Rama Dasu, S/o. VVSPR Vobilineni Aged 52 years, 3-16C-20/D3, Triveni Grand Apartments Santhi Nagar, Kakinada
3. Adabala Lakshmi, W/o. Suresh Kumar, Occupation: House Wife # 1-311/3, Rayudupalem, Kakinada Rural Mandal ... Respondents
[illegible]
[illegible]